ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

మంగళవారం 8 జూలై 2025



- ఖర్గే గ్రీన్ సిగ్నల్‌తో కాంగ్రెస్ నేతల్లో ఆశలు
- వేములవాడ 'రాజన్న' ట్రస్ట్ పదవుల కోసం ఎదురుచూపు
- 13 ఏళ్లుగా ఉత్సవ కమిటీలతోనే వేడుకలు

'రాజన్న' పాలక మండలికి మోక్షం లభించేనా?

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి పాలక వర్గం పదవులకు 13 ఏళ్లుగా నియామకాలు లేవు. వేములవాడ రాజన్న ఆలయానికి ట్రస్ట్‌బోర్డు లేకపోవడంతో ఉత్సవ కమిటీలతోనే కాలం వెల్ల దీస్తున్నారు. ప్రతి శివరాత్రి సందర్భంగా ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు ప్రక్రియ ముందుకు వస్తోంది. చివరకు నిరాశ పరుస్తూ ఉత్సవ కమిటీతోనే ముగిస్తున్నారు. తాజాగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నామినేట్ పదవులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర మంత్రులతో జరిపిన సమావేశంలో పదవులను ఆశిస్తున్న వారి పేర్లను షార్ట్‌లిస్ట్ చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు సూచనలు చేశారు. దీంతో ఈసారైనా వేములవాడ రాజన్న దేవస్థానానికి ధర్మకర్తల మండలి వస్తుందని కాంగ్రెస్ నాయకుల్లో ఆశలు మొదలయ్యాయి.

- (ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)



వివరాలు 7లో

సమస్యలు పరిష్కరించండి

- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

8



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్

రాజన్న ఆదాయం రూ. 1.99 కోట్లు

- 188 గ్రాముల బంగారం, 14.30 కిలోల వెండి
- హుండీ లెక్కింపును పరిశీలించిన ఈవో



వేములవాడలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

7

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లతో పాటు బెస్ట్ అవైలబుల్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్, మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్‌కు సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నాయకులు ర్యాలీగా తరలివచ్చారు. ఆరు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్ మెంట్‌తోపాటు స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని విద్యార్థులతో కలిసి నాయకులు జిల్లా కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురుచేస్తున్నాయన్నారు. అప్పులు తెచ్చి విద్యాసంస్థలను నడపలేమంటున్నారన్నారు. మరోపక్క విద్యార్థుల నుంచి పెండింగ్ ఫీజులను బలవంతగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్పందన లేకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13లక్షల మంది విద్యార్థులు బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు పైచదువులకు పోవాలంటే సర్టిఫికెట్‌ల కోసం కళాశాల చుట్టు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బకాయిలు విడుదల చేయాలని కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్‌కుమార్, జిల్లా బాలిక కన్వీనర్ సంజన, జిల్లా కమిటి సభ్యులు కడారి శివ, రాకేష్, దినేష్, జశ్వంత్, వినయ్, అరుణ్, శివ, సాయి, మధు, అక్షయ, మనీషా, రుచిత స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖపై నమ్మకం కలిగేలా గ్రీవెన్స్ డే : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖపై నమ్మకం కలిగేలా గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 23 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితు లకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. ఆర్జిదా రుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్ ఓలకు ఫోన్‌చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామన్నారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా , ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ఫిర్యాదుదారునికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ సమర్థవంతంగా సేవలు అందిస్తున్నామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.

భిక్షాటనతో బీఆర్ఎస్ నాయకుల నిరసన



సిరిసిల్లలో భిక్షాటన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ దుకాణాలలో బీఆర్ఎస్ నాయకులు బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ దాదాపు రూ. 700 కోట్లు బకాయిలు విడదల చేయపోవడంతో పేద విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా కరోనా టైంలో కూడా విద్యార్థులకు సమయానికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ అందించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టె శ్రీనివాస్, వడ్లూరి సాయి, సూర్య అనిల్, అఫ్రోజ్, అజ్జు, అనిల్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, హరీష్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల నిరసన



సిరిసిల్లలో కార్మిక సంఘాల నాయకుల బైక్ ర్యాలీ

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సన్నాహక కార్యక్రమంలో భాగంగా వివిధ పార్టీల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన నిరసనలు విజయవంతం అయ్యాయి. ముందుగా జిల్లా కేంద్రం కొత్త బస్టాండ్ నుంచి నేతన్న చౌక్, అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా వరకు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఆర్ఎస్ కార్మిక విభాగం, ఏఐఎఫ్‌టీయూ(న్యూ)జిల్లా నాయకులు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల ఉమ్మడ కార్యాచరణ ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేవశ్యాప్త సార్వత్రిక సమ్మె సన్నాహకాల్లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల నుంచి 29 కార్మిక చట్టాలను 4కోడ్‌లుగా మార్చి దేశంలోని కార్మికులను బానిసలుగా మార్చే ఆలోచనలు చేస్తుందని ఆరోపించారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో భాగంగా నిర్వహించే ర్యాలీ, ధర్నాలలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, ఉపాధ్యక్షుడు పంతం రవి, నాయ కులు మీసం లక్ష్మన్, ఎలగుండ రాజు, దుండ్రపెల్లి రవీందర్, దేవరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఎల్లారెడ్డి, జువ్వాది విమల ఉన్నారు.

వినియోగంలోకి ప్రగతి ప్రాంగణం

- ప్రాంగణం చుట్టూ పారిశుధ్య చర్యలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ప్రాంగణం చుట్టూ చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎల్లారెడ్డిపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులో నిర్మించిన ప్రగతి ప్రాంగణం చుట్టూ ఉన్న చెత్తాచెదారం తొలగింది. ప్రజలు శుభకార్యాలు జరుపుకునేందుకు సౌకర్యంగా నిర్మించిన ప్రగతి ప్రాంగణం పరిసరాలు ఖాళీ మద్యం సీసాలతో పాటు చెట్ల పొదల్లో నిరుపయోగంగా మారడంతో ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'నిరుపయోగంగా ప్రగతి ప్రాంగణం' కథనానికి పంచాయతీ కార్యదర్శి కృష్ణ సోమవారం స్పందించారు. ప్రగతి ప్రాంగణాన్ని పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేయించారు. తలుపులకు తాళం వేయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. గ్రామస్థులు ప్రగతి ప్రాంగణాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్స్ పెంచాలి

- ప్రత్యేకాధికారి రమణారావు

ముస్తాబాద్, జూలై7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్స్ పెంచాలని ఇంటర్ విద్యాశాఖ ప్రత్యేకాధికారి రమణారావు ఉపాధ్యాయులకు సూచించారు. ముస్తాబాద్ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి శ్రీనివాస్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కళాశాలలో వందశాతం ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. అధ్యాపకులు కొత్త విషయాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. పేద విద్యార్థులకు అకాడమిక్ మానిటర్ ఫండ్‌ద్వారా ఆర్థికంగా ఆదుకొని విద్యనందించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ విజయ్ రఘునందన్, ఇంచార్జి సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను సన్మానించిన బీఆర్ఎస్

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతిపై మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎండీ ఖదీర్ పాషాను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ పట్టణ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం నాయకులు పట్టణంలోని పారిశుధ్య పనులపై కమిషనర్‌తో చర్చించారు. గతంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలో 101 రూపాయాలకే స్వర్గధామంలో అంతిమ దహన సంస్కారాలు ఉండేవని దానికి కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మినారా యణ, వైస్ చైర్మన్ అడగట్ల మురళి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు కల్లూరి రాజు, గడ్డం లతభాస్కర్, బింగి రాంబాబు, పాత్తూరి రాజిరెడ్డి, నాయకులు బత్తుల రమేష్, బండారి శ్యాం, గడ్డం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కుడికాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన రైతులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఇల్లంతకుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు కుడికాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని మండల రైతులు తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని వల్లంపట్ల, వంతడుపుల, కిష్టరావుపల్లె, రంగపేట, గాలిపెల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని సమస్య విన్నవించారు. బావులు, బోర్లలో భూగర్భజలాలు తగ్గిపోవడం వల్ల వరిపంట వేయడానికి సరిపడా నీరు లేదన్నారు. మధ్యమానేరు కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు కేవీఎన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, పండుగ భాస్కర్, పెంటల నరేష్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన శిబిరం

ఎల్లారెడ్డిపేట, జూలై7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో వైద్యాధికారి సారియా అంజుమ్ ఆధ్వర్యంలోని సిబ్బంది సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. 135 మందికి పరీక్షలు నిర్వహించారు. 25 మందికి తెమడ నమూనాలు సేకరించారు. 30 మందికి ఎక్స్ రే పరీక్షల నిమిత్తం సిరిసిల్ల మెడికల్ కళాశాలకు పంపించామని పేర్కొన్నారు. దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, చెమటలు పట్టడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్న వ్యక్తులు వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. క్షయ వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం ఆరు నెలల పాటు నిక్షయ్ పోషణ్ పథకం కింద నెలకు వేయి రూపాయల నగదుతో పాటు పౌష్టికాహారం అందిస్తుందని వైద్యాధికారి సారియాఅంజుమ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహిపాల్, బాబు, పద్మ, ప్రసన్న, చైతన్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

- బ్యాక్ వాటర్‌లో మునిగిన ఆరెపల్లి పాఠశాల
- అద్దె ఇంటిలో కొనసాగింపు
- భవన నిర్మాణం చేపట్టాలని నిర్వాసితుల వేడుకోలు

చదువుకునేందుకు కష్టాలు



మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో మునిగిపోయిన పాఠశాల భవనాలు (ఫైల్)

వేములవాడ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చదువుకునేందుకు సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలో మొత్తంగా 40మంది వరకు విద్యార్థులు ఉన్నప్పటికీ 12 మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనిపిస్తు న్నారు. గ్రామంలో ఉన్న రెండుపాఠశాల భవనాలు మధ్యమానేరు జలాశాయంలో మునిగిపో వడంతో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల అద్దె ఇంట్లో కొనసాగుతోంది. ఆ ఇల్లు పూర్తిగా పగుళ్లతో ప్రమాదకరంగా మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపించకుండా ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నారని గ్రామస్థులు తెలి పారు. ఆరెపల్లి గ్రామంలో మొత్తం 172 కుటుంబాలు ఉండగా సుమారుగా 700మంది ప్రజలు జీవిస్తున్నారు. గ్రామంలో 40 మంది వరకు విద్యార్థులు ఉండగా 12 మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఆరెపల్లి గ్రామంలోని పాఠశాల రెండు భవనాలు ముంపునకు గురికావడంతో ఇప్పటికి పరిహారం రాలేదని నిర్వసితులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామ స్థులు వేడుకుంటున్నారు.



ఆరెపల్లిలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాల

బడి పరిహారం వెంటనే చెల్లించాలి

ఆరెపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ముంపు నకు గురికావడంతో బ్యాక్‌వాటర్ నీటిలో నాలుగు సంవత్స రాల క్రితం పూర్తిగా మునిగి పోయింది. దీంతో చేసేదేమీ లేక గ్రామంలోని ఓ పాత ఇంటిలో స్కూల్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం పాఠశాల భవనాలు నీటిలో మునిగిపోయినా పాఠశాల భవనానికి పరిహారం ఇప్పటి వరకు రాలేదు. దీంతో భవన నిర్మా ణం కాలేదని గ్రామస్థులు చెపుతున్నారు. వర్షాకాలం కావడంతో అద్దె ఇల్లు ప్రమాద కరంగా ఉందని విద్యార్థులు భయాందోళనలో విద్యనభ్యసిస్తు న్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలి

- మంజెడి వీరేశం, గ్రామస్థుడు, ఆరెపల్లి



మధ్యమానేరు జలాశయంలో తాము సర్వస్వం కోల్పోయాం. కనీసం మా పిల్లల భవిష్యత్తు కోసం పాఠశాల కూడా లేకపోవడంతో ఎంతో నిరాశకు గురవుతున్నాం. పాత పాఠశాల భవనానికి పరిహా రం వెంటనే చెల్లించి బడి నిర్మాణం చేపట్టాలి.

స్కూల్ భవనానికి పరిహారం చెల్లించాలి

- గుండెకార్ల లక్ష్మణ్, ఆరెపల్లి గ్రామస్థుడు



మధ్యమానేరు జలాశయంలో ఆరెపల్లి గ్రామానికి చెందిన పాఠశాల రెండు భవనాలు, పోచమ్మ, హనుమాన్ దేవాలయాలు మునిగిపోయాయి. యేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వాటికి పరిహారం రాలే దు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని పాఠశాల భవన నిర్మాణానికి పరిహారం ఇప్పించి బిల్డింగ్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ యుగేందర్ రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన సాయికుమార్ అనకాపెల్లికి చెందిన మాధవి నాలుగేళ్లుగా సహజీవనం చేస్తూ వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీకాంత్ అనేవ్యక్తితో మాధవి సన్నిహితంగా ఉండడం తెలుసుకున్న సాయికుమార్ ఆమెను మందలించాడు. దీంతో సాయికుమార్ మాధవి మధ్య గొడవలు తలెత్తాయి. ఈ గొడవలను మనసులో పెట్టుకున్న మాధవి ఎలాగైనా సాయికుమార్ నుంచి డబ్బులు, భూమికి సంబంధించిన కాగితాలు తీసుకోవాలని పథకం రచించింది. జూన్ 26న మాధవి, శ్రీకాంత్, ఆమె సోదరుడు గణేశ్ కలిసి సాయికుమార్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులను కిడ్నాప్ చేశారు. హైదరాబాద్ మార్గమధ్యలో వాహనం నిలిపి సాయికుమార్‌ను చంపుతామని బెదిరించారు. దీంతో సాయికుమార్ తనవద్ద ఉన్న రూ.10వేలు, బ్యాంకుచెక్కులు, భూమికి సంబంధించిన కాగితాలు, రెండు సెల్ ఫోన్లు, స్కార్పి యోకారును స్వాధీనం చేశాడు. మరోవ్యక్తిని బెదిరించగా రూ.60వేలు ఇచ్చాడు. శామీర్‌పేటవద్ద వాహనం నుంచి తప్పించుకున్న సాయికుమార్ అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన శామీర్‌పేట పోలీసులు కొత్తపల్లికి బదిలీచేశారు. కొత్తపల్లి ఎస్సై దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితులు మాధవి, శ్రీకాంత్ కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. వారివద్ద నుంచి రూ.2వేలు స్వాధీనం చేసుకున్నట్లు, అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు కరీంనగర్ రూరల్ సీఐ యుగేందర్ రెడ్డి తెలిపారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ



రోదిస్తున్న దేవర్ల రాజవ్వ

కాల్వశ్రీరాంపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడిచేసి మెడలో బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని కూనారం గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం దేవర్లరాజవ్వ అనే వృద్ధురాలు ఇంటి ఎదుట కూర్చోగా ఇద్దరుయువకులు బండిపై వచ్చి తాము ఇక్కడకూర్చొని కల్లుతాగి వెళ్తామని వృద్ధురాలిని నమ్మించారు. వృద్ధురాలితో మాట్లాడుతూ ఆమెమెడలోనిరెండు తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకొని పారిపోయినట్లు తెలిపింది. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారువచ్చి పోలీసులకు సమాచారం అందించారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేష్, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలను తనిఖీచేశారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మూడు నెలలుగా జీతాలు లేక వెతలు

- 200 మందికి పైగా ఉపాధిహామీ సిబ్బంది ఇక్కట్లు
- గ్రీన్‌ఛానల్ పేరిట జాప్యం చేస్తున్న ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు కోసం క్షేత్ర స్థాయిలో, మండల, జిల్లా కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మూడు నెలలుగా జీతాలకు నోచుకోలేదు. ఉద్యోగ భద్రత లేక అల్లాడు తున్న సంబంధిత ఉద్యోగులకు నెలనెలా చెల్లించాల్సిన వేతనాలను ఇవ్వడంలో ఆరు మాసాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాప్యం చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన వేతనాలను ఒకేసారి ఏప్రిల్‌లో చెల్లించగా, ఏప్రిల్, మే, జూన్ మాసాల వేతనాలను ఇప్పటి వరకు ఇవ్వలేదని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉండేందుకు 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తీసుకవచ్చింది. ఈ పథకం ద్వారా జాబ్ కార్డులు కలిగిన ప్రతీ కుటుంబానికి ఏడాదిలో 100 రోజుల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా చట్టం తీసుక వచ్చారు. ఈ పథకం వ్యవసాయ కూలీలు, ఇతర కూలీలు ఆయా ప్రాంతాలకు వలస వెళ్లకుండా నిరోధించడమే కాకుండా కూలీలు చేసే పనులతో జనరేట్ అయ్యే 40 శాతం నిధులను మెటీరియల్ కంపోనెంట్ కింద గ్రామాల్లో శాశ్వతనిర్మాణాలు చేపడుతున్నారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, మురికి కాలువలు, సిమెంట్ రోడ్లు, సెగ్రి గేషన్ షెడ్లు, రైతువేదికలు నిర్మించారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకించి డ్వామా ఆధ్వర్యంలో ఉద్యోగుల ను నియమించింది.

ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్, మండలానికి ముగ్గురి నుంచి ఐదుగురి వరకు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒకరు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కూడా ఒకరు ఉంటారు. జిల్లా కార్యాలయంలో ఏపీవోలు, పలువురు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వీరికి కేంద్ర ప్రభుత్వం కేటాయించే ఉపాధి హామీ పథకానికి కేటాయించే నిధుల నుంచే వేతనాలను అందజేస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు 11,900 రూపాయలు, టీఏ, డీఏల కింద 400 నుంచి 500 రూపాయల వరకు, టెక్నికల్ అసిస్టెంట్లకు 32 నుంచి 35 వేల వరకు, ఏపీఎంలకు 40 వేలకు పైగా వేతనాలు ఇస్తున్నారు. తమకు ఉద్యోగభద్రత కల్పించాలని కొన్నేళ్లుగా పోరాడుతున్న ప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదు. ఆరు మాసాల నుంచి నెల నెలా వేతనాలు అందక సదరు సిబ్బంది ఇబ్బందులు పడుతు న్నారు.

పిల్లల ఫీజులు, ఈఎంఐలకు ఇక్కట్లు..

జూన్ నెల వచ్చిందంటే అన్ని వర్గాలకు చెందిన వారికి ఆర్థిక భారమే. రైతులకు వ్యవసాయ పెట్టుబడులతోపాటు పిల్లల చదువులకు ఫీజులు చెల్లించడం, ఉద్యోగాలు చేసే వారికి కూడా పిల్లల చదువులకు ఫీజులు చెల్లించడం, యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ కొనగోళ్లు ఉంటాయి. నెలనెలా కుటుంబ నిర్వహణ ఖర్చులు, ఇంటి అద్దెలు, విద్యుత్ చార్జీల చెల్లింపులు, ఈఎంఐలు, పెట్రోల్ చార్జీల ఖర్చులు ఉంటాయి. నెల నెలా వేతనాలు ఇవ్వక పోవడంతో ఉపాధిహామీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు తీసుకుని వస్తున్నారు. ఒక్కోసారి అప్పులు దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా నెలనెలా వేతనాలు చెల్లించేందుకు ఒక యాప్‌ను రూపొందిస్తున్నా మని, ఆ కారణంగానే వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నదని రాష్ట్ర స్థాయి అధికారులు చెబుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. కానీ అది సహేతుకమైన కారణం కాదని, యాప్ రూపొందించేందుకు ఆరు మాసాలు పడుతుందా అని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతరులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే మూడు మాసాల వేతనాలను విడుదల చేసి, ఇక నుంచి నెలనెలా ఇవ్వాలని ఉపాధిహామీ సిబ్బంది కోరుతున్నారు.

వేతనాలు రాక ఇబ్బందులు..

ఆవాల ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు



నెల నెలా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. ఏప్రిల్, మే, జూన్ నెలల వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదు. మూడు మాసాల నుంచి వేతనాలు రాకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి. విధులు నిర్వహించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో తిరగాల్సి ఉంటుంది. ఇందుకు వాహనంలో పెట్రోల్‌కు కూడా డబ్బులు లేవు. ఐకేపీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించినట్లుగానే, మాకు కూడా కల్పించాలని పోరాటం చేసినా ఫలించ లేదు. ఇబ్బందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకుని పెండింగులో ఉన్న మూడు నెలల వేతనాలను విడుదల చేసి, నెలనెలా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

మసాజ్ నిర్వాహకుడిని దోచుకున్న ముఠా

- ముగ్గురి అరెస్టు, పరారీలో మరొకరు

కరీంనగర్ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో యాప్ ద్వారా సాధారణ, సెక్సువల్ మసాజ్ సేవలను అందిస్తున్న యువకుడిని ఓ ముఠా దోపిడీ చేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా తాళ్లపల్లికి చెందిన పిపావత్ నగేశ్(21) కరీంనగర్‌లో డిగ్రీ చదువుతూ రాంనగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో స్పామసాజ్ నేర్చుకున్న నగేశ్ కరీంనగర్ వచ్చి 'గ్రైండర్' అనే డేటింగ్ యాప్‌ను ఉపయోగించి హోమో సెక్సువల్ మసాజ్‌లు చేయడం మొదలు పెట్టాడు. ఎవరైనా ఫోన్‌చేసి కోరితే వారివద్దకు వెళ్లి మసాజ్ చేసి డబ్బులు తీసుకునేవాడు. ఈనెల4న గ్రైండర్ యాప్ ద్వారా ఒకవ్యక్తి నగేశ్‌ను మసాజ్ కోసం పిలిచాడు. కరీంనగర్ నుంచి పెద్దపల్లి వెళ్లే దారిలో ఉన్న ఎఫ్ఎం రేడియో స్టేషన్ వద్దకు రమ్మని చెప్పడంతో నగేశ్ అక్కడికి వెళ్లాడు. అక్కడ ఓ వ్యక్తితో మసాజ్‌ల గురించి మాట్లాడుతుండగా మరో ఇద్దరు వచ్చారు. డబ్బులు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని నగేశ్‌ను కొట్టారు. భయపడిన నగేశ్ ఫోన్‌పే ద్వారా 15వేల రూపాయలు పంపించాడు. జేబులో ఉన్న రెండు వేలు, చేతికి ఉన్న వాచ్ ఇచ్చేశాడు. డబ్బులు తీసుకున్న అనంతరం నిందితులు అక్కడినుంచి పారిపోయారు. భయంతో రెండు రోజులు హాస్టల్‌లోనే ఉన్నబాధితుడు శనివారం కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండుబృందాలు నిందితుల కోసం గాలించాయి. సోమవారం మధ్యాహ్నం సాంకేతికతను ఉపయోగించి రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని విజయనగర్‌కు చెందిన ఎస్కే షాబుద్దీన్ అలియాస్ సాదాబ్ ఇంటి వద్దకువెళ్లిన పోలీసులు ఈనేరంలో పాల్గొన్న ముగ్గురు నిందితులు ముస్తాఫా అలియాస్ ఇమ్రాన్, మహ్మద్ అమీర్, సాదాబ్‌ను అరెస్టు చేశారు. విచారణలో నేరం చేసినట్లు ఒప్పుకున్నారని, బషీర్‌అనే మరో నిందితుడు పారిపోయాడని సీఐ తెలిపారు. వారివద్ద నుంచి 14 వేల రూపాయలు, మూడుసెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న బషీర్‌ను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు ఒక సూచన చేశారు. ఇకపై ఎవరైనా సెక్సువల్ అప్లికేషన్లు ఉపయోగించి ఇతరులను మోసపూరితంగా పిలిపిస్తే, వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా హిజ్రాలు, యువకులు, విద్యార్థులు ఇటువంటి యాప్‌లకు దూరంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అటువంటి అసాంఘిక కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే, లేదా ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసినవారిలో సీఐనిరంజన్‌రెడ్డితో పాటు ఎస్ఐ లక్ష్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

సిరిసిల్ల క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లఅర్బన్ పరిధిలోని పెద్దూరు గ్రామశివారులోని వైన్స్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బరిగెల అరుణ్‌కుమార్(27) అనే యువకుడు సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మరో యువకుడు నెహ్రూనగర్‌కు చెందిన తడుక సాయిచరణ్(27) తీవ్రగాయాలై చికిత్సపొందుతున్నాడు. సిరిసిల్లనుంచి పెద్దూరుకు ద్విచక్రవాహనంపై అరుణ్‌కుమార్ తనస్నేహితుడైన సాయిచరణ్‌తో కలిసి వెళ్తుండగా కామా రెడ్డి నుంచి సిరిసిల్లవైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అరుణ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. మెరుగైనచికిత్సకోసం కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సిరిసిల్ల పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన బరిగెల రవి, పద్మలకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు అరుణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సిఐ కె కృష్ణ తెలిపారు.

పికప్ వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

వీణవంక, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలం లోని చల్లూరుగ్రామంలో వాకింగ్‌చేస్తున్న కొలి పాక రాజయ్య(60)ను పికప్‌వాహనం ఢీకొంది. పోలీసుల వివరాలప్రకారం.. రాజయ్య ఉదయం వాకింగ్ చేస్తుండగా చల్లూరువైపు నుంచి వస్తు న్న పికప్‌వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయంతెలుసు కున్న ఎస్ఐ సంఘటనస్థలానికిచేరుకొని విచా రణ చేపట్టారు. పికప్ వాహనం డ్రైవర్ ఎడ్ల రాజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సంఘటన స్థలాన్ని జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



చిన్నయ్య(ఫైల్)

ధర్మారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ పెట్రోల్‌బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మారంగ్రామానికిచెందిన మాజీ ఎంపిటీసి మెడవేని తిరుపతి తండ్రి చిన్నయ్య(68) సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోయించుకోవడానికి వెళ్తున్నాడు. పెట్రోల్ బంక్‌లోకి బండి తిరిగే క్రమంలో వేగంగా వచ్చిన బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టి కొంతదూరం లాక్కెల్లింది. దీంతో తలకు తీవ్రగాయమైన చిన్నయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనస్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐశీలం లక్ష్మణ్ కేసుదర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన కోట సుశీల(75) సోమవారం తెల్లవారుజామున ఎల్లమ్మ చెరువులో శవమై కనిపించింది. కొంతకాలంగా బీపీ, షుగర్ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున సుశీల ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఉదయం ఆమె మృతదేహం చెరువులో తేలియాడుతూ కనిపించింది. మృతిపై అనుమానాలు లేవని సుశీల భర్త కోట ఈశ్వరయ్య తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి బలవన్మరణం

ఇల్లందకుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామానికిచెందిన పెద్ది సమ్మయ్య(45) అనేవ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్యకు ముగ్గురు కూమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. మూడు సంవత్సరాల క్రితం పెద్ద కూతురు వివాహం చేశాడు. పెళ్లిసమయంలో అప్పులు అయ్యాయి. ఆఅప్పులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఎలాతీర్చాలని మనస్తాపానికిగురైతాగుడుకు బానిసయ్యాడు. జూన్ 29న మక్క చేను వద్దకు వెళ్లి పురుగుల మందుతాగి ఇంటికి తిరిగి వచ్చి కింద పడిపోయాడు. ఇంట్లో కూతర్లు ఏమయిందని అడుగగా గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు, స్థానికులు సమ్మయ్యను వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడినుంచి మెరుగైన చికిత్సకోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆస్పత్రిలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు సమ్మయ్య కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతి కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామానికి చెందిన కారు డ్రైవర్ క్యాదం శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని రాచర్లతిమ్మాపూర్ గ్రామంలోని నల్లనాగుల రాజు ఈనెల4న తన ఎలక్ట్రికల్ స్కూటీపై రాచర్లగొల్లపల్లి వైపుకు వెళుతున్న క్రమంలో శ్రీనివాస్ తన కారుతో ఢీకొట్టాడని పేర్కొన్నారు. బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్ రెడ్డి వివరించారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

ఓదెల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి పోలీస్ స్టేషన్లో సోమవారం బాధితుడు పిట్టల మహేష్‌కు ఎస్సై దీకొండ రమేష్ రూ.18వేల విలువైన సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఎస్ఐ మాట్లాడుతూ, మహేష్‌సెల్‌ఫోను పోగొట్టుకోగా అతని ఆధార్‌నంబర్ ఆధారంగా మొబైల్ ఐఎంఈఐ నెంబర్లను సిఈఐఆర్ పోర్టల్ అప్‌లోడ్ చేశారన్నారు. దీంతో సెల్‌ఫోన్ ఆచూకీ లభించిందన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాల కులస్తులు

హుజూరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, యూట్యూబర్ పరకాల సమ్మయ్యగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాల కులస్తులు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలజాతి యోధుడు మాల కన్నమదాసు చిత్రపటంలోని తలభాగాన్ని తొలగించి ఎమ్మెల్యే తలభాగాన్ని అతికించి సోషల్ మీడియాలో యూట్యూబర్ పరకాల సమ్మయ్యగౌడ్ వైరల్ చేశాడన్నారు. మాలలను అవమానపరిచేలా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, పరకాల సమ్మయ్యగౌడ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వారిద్దరూ మాలలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు సొల్లు బాబు, సందమల్ల నరేష్, మాదాసు రాహుల్, శీలం రాజు, పసుల స్వామి, జంగ అనిల్‌కుమార్, తొగరు విజేందర్, ముక్క రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

లిఫ్ట్ అడగటమే అంగన్‌వాడీ టీచర్‌కు శాపమైంది

- అడవిలోకి దారి మళ్లించిన వాహనదారుడు
- కిందకు దూకడంతో తలకు గాయం

వీర్నపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న అంగన్వాడీ టీచర్ వాహనదారుడిని లిఫ్ట్ అడగటమే శాపమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన మారోజు స్వరూప అనే అంగన్వాడీ టీచర్ సోమవారం విధులు ముగించుకుని మద్దిమల్లకు నడుచుకుంటూ వెళ్తోంది. ఈక్రమంలో ద్విచక్ర వాహనంపై అటుగా వస్తున్న తండాకు చెందిన ఓ వ్యక్తిని లిఫ్ట్ అడిగింది. ఇదే అదనుగా భావించి ఆవ్యక్తి టీచర్‌ను బైక్‌పై ఎక్కించుకొని వేగంగా మద్దిమల్లకు వెళ్లకుండా దారి మళ్లించాడు. అటవీ ప్రాంతం ఉన్న గ్రామంవైపు వెళుతుండగా భయంతో ఆమె కేకలు వేసినట్లు స్థానికులు తెలిపారు. భయాందోళనతో వెంటనే వాహనంపై నుంచి దూకడంతో తలకు బలంగా గాయమైంది. వాహనదారుడు అక్కడినుంచి బైక్‌పై పరారయ్యాడు.

అక్కడే అంగన్వాడీ టీచర్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచార మందించారు. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న అంగన్వాడీ టీచర్‌ను ఎస్ఐ లక్ష్మణ్ పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



చోరీ కేసులో నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ రాజు

మంథని, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లో దొంగతనాల నియంత్రణకు ప్రత్యేకచర్యలు చేపడుతున్నట్లు సీఐ రాజు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. పలు దొంగతనాల కేసుల్లో విచారణ జరిపి దొంగలను పట్టుకొని సొమ్ములను స్వాధీనంచేసుకున్నట్లు వెల్లడించారు. మంథని మండలం ధర్మారం గ్రామంలో గతనెల18న ఇంట్లో ఒంటరిగా ఉంటున్న కందుకూరి లక్ష్మిమెడలో నుంచి 2తులాల బంగారు తాడు చోరీకేసులో విచారించి ఇదేగ్రామానికి చెందిన రాయినేని అనిల్, రాయినేని మల్లయ్య అనే తండ్రీకొడుకులను అరెస్టుచేసినట్లు తెలిపారు. గతంలో పుట్టపాకలో జరిగిన ట్రాక్టర్ చోరీ కేసులో గ్రామానికి చెందిన ముప్పిడి రమేష్, గంగాపురికి చెందిన దాకమూరి ప్రసాద్‌లు అరెస్టు చేశామన్నారు. సుందిళ్ళ పంపు హౌజ్ వద్ద జరిగిన ఇనుము దొంగతనంలో గోదారి మహేందర్, సెగ్గెం మనోహర్, చల్లా సంజీవ్, ఉడుత సంజీవ్, సాదుల లస్మయ్య, ఉడుత రాజయ్య, ఇసంపెల్లి కిరణ్‌కుమార్‌లను అరెస్టు చేశామన్నారు. మంథని పాత పెట్రోల్ పంపు వద్ద జరిగిన బైక్ దొంగతనం కేసులో అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన రత్నం రాజ్‌కుమార్, వాసవినగర్‌లోని ఇల్లెందుల వెంకటేశ్వర్లు ఇంట్లో జరిగిన చోరీ కేసులో మంథనికి చెందిన తిరుహరి రాజనర్సింహస్వామిని అరెస్టు చేశామన్నారు. ముత్తారంలో వడ్ల దొంగతనం కేసులో అడవిశ్రీరాంపూర్ చెందిన మండ రాజేందర్, పెయ్యాల అర్జున్‌లను గతంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. రామగిరి మండలంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైతే ఒక కేసును ఛేదించినట్లు తెలిపారు. ఎస్ఐలు రమేష్, శ్రీనివాస్, నరేష్‌లు పాల్గొన్నారు.

పంచాయితీ పెద్దల నిర్వాకం

- భూ సమస్యల వల్ల రైతు ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేందర్

ఓదెల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన తోట రాజేందర్ అనే రైతు పెద్దమనుషుల నిర్వాకంతో సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ప్రకారం.. రాజేందర్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇల్లు కట్టుకోవడానికి అదనపు ఖర్చులు అవసరం కోసం 30గుంటల వ్యవసాయ భూమిలో 8 గుంటలను రూ.3.90లక్షలకు ఇదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి విక్రయించాడు. సదరువ్యక్తి బయానాగా లక్ష రూపాయలు ఇచ్చాడు. అనంతరం ఆవ్యక్తి 8గుంటలకు బదులుగా మొత్తం 30గుంటల భూమిని దున్నుకోవడంతో వీరిద్దరి మధ్య వివాదం ప్రారంభమైంది. దీంతో ఇరువురు పెద్ద మనుషులను ఆశ్రయించారు. పంచాయితీ పెద్దలు రాజేందర్‌వద్ద రూ.50వేలను తీసుకున్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయితీ జరిగింది. సోమవారం పెద్ద మనుషులు భూమి కొనుగోలు చేసిన వ్యక్తికి మద్దతుగా నిలిచారు. దీంతో ఆందోళనచెందిన రాజేందర్ తనకు భూమి దక్కుతుందో లేదోనని మనోవేదనకు గురై సోమవారం గడ్డిమందు తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఆసుపత్రికి తరలించి చికిత్సచేయిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. కాగా ఈ విషయమై ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

మార్చురీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతూ ఈ నెల5న గుర్తుతెలియనివ్యక్తి మరణించినట్లు టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కరీంనగర్ టూటౌన్ పోలీ స్స్టేషన్‌లో, ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు. మృతదేహాన్ని ప్రభు త్వాస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామని తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

కరీంనగర్ లీగల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఒకరిపై కత్తితో దాడిచేసి గాయపరిచిన కేసులో గుండేటి సన్నీ షాన్(37)కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ కరీంనగర్ ప్రిన్సి పల్ అసిస్టెంట్ సెషన్స్‌జడ్జి శ్రీలేఖ సోమవారం తీర్పుని చ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పట్టణంలోని రైతుబజార్‌లో నివాసం ఉంటున్న గుండేటి సన్నిషాన్ తాగుడుకు బానిసయ్యాడు. ప్రతీ రోజు రాజీవ్‌నగర్‌లోని బీట్ మార్కెట్‌కు వచ్చి షాపుల వారిని బెదిరిస్తూ తాగుడుకు డబ్బులు అడిగేవాడు. తాను అడిగిన డబ్బులు ఇవ్వలేదనే కోపంతో 2024 జూన్ 8న మధ్యాహ్నం ఒకషాపు యజమాని లింగంపల్లి ఎల్లయ్య (58)ను కత్తితో గాయపరిచాడు. ఈ సంఘటనతో కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు సన్నీ షాన్‌పై హత్యాయత్నం కేసునమోదు చేశారు. అప్పటి సీఐ సరిలాల్ దర్యాప్తు చేశారు. పీసీ సర్వర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి విచారించారు. జడ్జిసాక్షాధారాలు పరిశీ లించి సన్నీ షాన్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు

జగిత్యాల క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని అత్యాచారంచేసిన కేసులో నిందితుడికి 10సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.5,500 జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్, సెషన్స్‌జడ్జి నారాయణ సోమవారం కీలకతీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనంప్రకారం రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓవృద్ధురాలు తనఇంటిలో ఒంటరిగా నివసిస్తోంది. 2022సెప్టెంబరు 19న అదే గ్రామానికి చెందిన పుట్ట గంగరాజం అనే వ్యక్తి వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలితో పాటు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఏఎస్సై దేవేందర్ కేసు నమోదు చేశారు. సీఐ కృష్ణ కుమార్ కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, రాజులు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.




అదిరిపోయే విన్యాసాలు

కరీంనగర్ క్రీడా పాఠశాల విద్యార్థులు అద్భుత విన్యాసాలతో అదరగొట్టారు. రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జిమ్నాస్టిక్స్ విన్యాసాలను ప్రదర్శించారు. అద్భుత విన్యాసాలను చూసిన మంత్రులు, అధికారులు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి కరీంనగర్




రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి కల్యాణకట్టలో తల నీలాలు సమర్పించుకున్నారు. కోడెను కట్టేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లోపూజలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యారు.

రాజన్న సేవలో బండి సంజయ్ సతీమణి..: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి అపర్ణ దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆమె ముందుగా రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఏఈవో శ్రీనివాస్ రాజన్న ప్రసాదం అందజేశారు. వారి వెంట ప్రొటోకాల్ ఏఈవో అశోక్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజేందర్, గొట్టం రవి తదితరులు ఉన్నారు.

రాజన్న ఆదాయం రూ. 1.99 కోట్లు
188 గ్రాముల బంగారం, 14.30 కిలోల వెండి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి 25 రోజులు హుండీలను సోమవారం ఆలయ ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య హుండీలను విప్పి లెక్కించగా ఆలయ ఖజానాకు రూ. ఒక కోటి 99 లక్షల 960 నగదు, 188 గ్రాముల మిశ్రమ బంగారం, 14 కిలోల 300 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో రాధాబాయి వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన హుండీ లెక్కింపు రాత్రి వరకు కొనసాగింది. హుండీ కౌంటింగ్‌ను ఈవో దగ్గరుండి పరిశీలించారు. హుండీ లెక్కింపులో ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు, సిబ్బంది, శ్రీరాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం



- సంస్థాగత పటిష్ఠానికి మరో అడుగు
- ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించిన కాంగ్రెస్
- ఉమ్మడి కరీంనగర్ ఇన్‌చార్జిగా అద్దంకి దయాకర్
- మెదక్ ఇన్‌చార్జిగా పొన్నం ప్రభాకర్
- వరంగల్ ఇన్‌చార్జిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ అధిష్ఠానం స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీని సంస్థాగతంగాపటిష్ఠవంతంగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించింది. ఆ దిశగా మరో అడుగువేస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను నియమించింది. జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా ప్రకటించింది.



అద్దంకి దయాకర్

విధి విధానాలు వివరించిన అధిష్ఠానం

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలుగా నియమితులైన వారితో సోమవారం జూమ్ మీటింగ్ నిర్వహించి వారి విధివిధానాలను వివరించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను వేయాలని, ఈ నెలాఖరులోగా నామినేటెడ్ పదవుల భర్తీ చేయాలన్నారు. ఆగస్టులోగా సంస్థాగత కమిటీల నిర్మాణం పూర్తి కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా గత అసెంబ్లీ ఎన్నికల్లో మానకొండూర్, చొప్పదండి, ధర్మపురి, మంథని, పెద్దపల్లి, వేములవాడ, రామగుండం నియోజకవర్గాలను కాంగ్రెస్ గెల్చుకున్నది. హుజూరాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. అనంతరం జగిత్యాల శాసనసభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు.

గతంలో ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం సిద్దిపేట జిల్లాలో కలవగా, అందులో రెండు మండలాలు కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. ఇక్కడ నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ గెలుపొందారు. ఈ నియోజకవర్గ పరిధిలోని కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలను కరీంనగర్‌లో కలిపేందుకు కృషి చేస్తామని ఎన్నికలకు ముందు పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆయన ఇప్పుడు రాష్ట్ర మంత్రివర్గంలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో త్వరలోనే ఆ హామీ అమలు లోకి వస్తుందని నియోజకవర్గ ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. అదే జరిగితే ఉమ్మడి జిల్లా పరిధి లోకి 13 నియోజకవర్గాలు వస్తాయి.

● **ప్రతిపక్షాలకు దీటుగా..**

బీఆర్ఎస్ నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నది. అన్ని నియోజక వర్గాల్లోనూ పార్టీకి బలమైన కేడర్ ఉన్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌పై పైచేయి సాధిస్తాని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. బీజేపీ నుంచి కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన బండి సంజయ్‌కుమార్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన ఉమ్మడి జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల్లో గత ఎన్నికల సమయం నుంచి బీజేపీకి గ్రామీణ స్థాయిలో కేడర్ పెరుగుతూ వస్తున్నది. ఈ ఎన్నికల్లో బండి సంజయ్ అండదండలతో పట్టును మరింత పెంచుకుని స్థానిక సంస్థలలో పెద్ద ఎత్తున సీట్లు సంపాదించాలని బీజేపీ నాయకత్వం భావిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలను బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నందున కాంగ్రెస్ నాయకత్వం కూడా ఆ దిశగానే చర్యలు తీసుకుంటున్నది.

ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానం పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ప్రకటించింది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శులు మహ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఆడెం రాజ్ దీక్‌పతి ఈ పార్లమెంట్ నియోజకవర్గ సంస్థాగత కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా గాలి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శులు మల్లాడి రాంరెడ్డి, కాశిపాక రాజేశ్, రహ్మత్ హుస్సేన్‌ను నియమించారు. ఈ సమన్వయకర్తల్లో ఉపాధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యులుగా ఉంటుండగా ప్రధాన కార్యదర్శులు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా ఉంటూ తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. వీరికి తోడుగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిలను ప్రకటించారు. త్వరలోనే సంస్థాగత నిర్మాణం దిశగా మరికొన్ని చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

ప్రజాస్వామిక తెలంగాణగా మార్చడానికి టీజేఎస్ కృషి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



శంకరపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలు ఆకాంక్షించినట్లుగా ప్రజాస్వామిక తెలంగాణగా మార్చడానికి తెలంగాణ జనసమితి నిరంతరం కృషి చేస్తుందని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లా వద్ద తెలంగాణ జన సమితి ప్లీనరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందన్నారు. కుల గుణన జరిగిన నేపథ్యంలో అన్ని కులాలకు న్యాయం జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లకాలంలో ఉద్యమ ఆకాంక్షలను పక్కన పెట్టడమే కాకుండా సొంత సంపాదనకు విపరీతమైన ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. కాళేశ్వరంలో నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. ప్రాజెక్టులో నిర్మాణ పరమైన లోపాలు ఉన్నాయన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, జిల్లా కన్వీనర్ మోరే గణేష్, నీలవేణి రమేష్ ఉన్నారు.

నైపుణ్యం పెంపునకు పోలీస్ డ్యూటీ మీట్

రాజన్న జోన్ స్థాయి పోటీలు ప్రారంభం




పోటీలు ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డ్యూటీ మీట్‌కు హాజరైన వివిధ జిల్లాల పోలీసు అధికారులు

కరీంనగర్ క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి):పోలీసు వృత్తిలో నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ మరింత పెంపొందించుకునేందుకు పోలీసు డ్యూటీ మీట్‌ను నిర్వహిస్తున్నట్లు సీపీ గౌస్ ఆలం అన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా నిర్వహిస్తున్న రాజన్న జోన్-3 స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను సోమవారం కరీంనగర్‌లో ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర రెండో పోలీస్ డ్యూటీ మీట్ ఈ నెలలో వరంగల్‌లో నిర్వ హించనున్నారు.

ఇందులో భాగంగా రాజన్న జోన్ పరిధిలోని కరీంనగర్, సిద్దిపేట పోలీస్ కమిషన రేట్లు, మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల పరిధిలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి కరీంనగర్ కమిషనరేట్‌లో పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేర దర్యాప్తులో మరింత శాస్త్రీయత సాధించే దిశగా డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో నేర విచారణలో ఎదురయ్యే అంశాలకు సంబంధించి మెళకువలు నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెలలో వరంగల్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కి ఎంపికవుతారని సీపీ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్ విజయ్ కుమార్, వాసాల సతీష్, వేణుగోపాల్, యాదగిరిస్వామి, రంగనాయక్ పాల్గొన్నారు.

మొదటిరోజు రాజన్న జోన్ పరిధిలోని అధికారులు, సిబ్బందికి కింది విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

● సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్: ఫోరెన్సిక్ సైన్స్, క్రైం ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, రాత పరీక్ష, మెడికో లీగల్ టెస్ట్, ఓరల్ టెస్ట్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్‌బిట్స్, ప్రాక్టికల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్ (ప్రాక్టికల్, ఓరల్ టెస్ట్), క్రైం సీన్ ఫొటోగ్రఫీ (ప్రాక్టికల్), పోలీస్ పోర్ట్రెట్ (ప్రాక్టికల్, రాత పరీక్ష), అబ్జర్వేషన్ టెస్ట్ (ప్రాక్టికల్, రాత పరీక్ష).

● యాంటీ సబొటేజ్ చెక్: వెహికల్ సెర్చ్, గ్రౌండ్ సెర్చ్, రూమ్ సెర్చ్, యాక్సిస్ కంట్రోల్.

● కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్: కంప్యూటర్ అవేర్నెస్, ఆఫీస్ ఆటోమేషన్, ప్రోగ్రామింగ్ ఎబిలిటీ.

●డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్: ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్, నార్కొటిక్స్ సెర్చ్. ● పోలీస్ ఫొటోగ్రఫీ కాంపిటీషన్.

● పోలీస్ వీడియోగ్రఫీ కాంపిటీషన్

కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు కృషి

శాట్ వీసీ, ఎండీ సోనీ బాలాదేవీ



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ, ఎండీ సోనీ బాలాదేవీ అన్నారు. సోమవారం ప్రాంతీయ క్రీడా పాఠశాలను సందర్శించారు. పలు అంశాలపై హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, కోచ్‌లతో చర్చించారు. పాఠశాలకు అవసరమైన క్రీడా సామగ్రి అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వీలైనంత తొందరలో పాఠశాలలో ఎన్‌సీసీను ప్రవేశ పెట్టేందుకు కృషి చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. అందుకు అవసరమైన అధికారులతో తాను మాట్లాడుతానని తెలిపారు.

కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఉడెన్ ఫ్లోర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. క్రీడా పాఠశాలలోని స్విమ్మింగ్ పూల్‌లో స్టార్టర్స్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. క్రీడా పాఠశాలలో విద్యార్థులకు శిక్షణను అందించేందుకు కోచ్‌లు అవసరమైతే తనకు రాతపూర్వకంగా తెలపాలన్నారు. క్రీడాకారులకు సదుపాయాల కల్పనలో వెనకడుగు వేసేది లేదన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో పెవిలియన్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలను తీసుకుంటామన్నారు. అంబేద్కర్ స్టేడియంలో 8 లైన్ సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని డీవైఎస్‌వోను ఆదేశించారు. ఈ సమావేశంలో శాట్ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, డీవైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్, డీఈవో శ్రీరాం మొండయ్య, జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ అధికారి మిల్కూరి శ్రీనివాస్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ప్రతినిధులు తుమ్మల రమేష్ రెడ్డి, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కరీం పాల్గొన్నారు.

రాజన్న పాలక మండలికి మోక్షం లభించేనా..?



- ఖర్గే గ్రీన్ సిగ్నల్‌తో కాంగ్రెస్ నేతల్లో ఆశలు
- వేములవాడ ఆలయ ట్రస్ట్ బోర్డు కోసం ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 18 నెలలు గడిచింది. కాంగ్రెస్ నాయకులకు నామినేట్ పదవులు ఎదురుచూపులనే మిగిలిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులు భర్తీ చేశారు. జిల్లాలో అతి కీలక మైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి పాలకవర్గం పదవులు మాత్రం ఖాళీగానే ఉన్నాయి.

ప్రతి శివరాత్రి పర్వదినం సందర్భంగా ట్రస్ట్‌బోర్డు భర్తీ ప్రక్రియ ముందుకు వస్తోంది. చివరకు ఉత్సవ కమిటీతోనే ముగిస్తున్నారు. తాజాగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నామినేట్ పదవులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర మంత్రులతో జరిపిన సమావేశంలో పదవులను ఆశిస్తున్న వారి పేర్లను షార్ట్ లిస్ట్ చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, నియోజక వర్గ ఇన్‌చార్జిలకు సూచనలు చేశారు. దీంతో ఈసారి వేములవాడ రాజన్న దేవస్థానానికి ధర్మకర్తల మండలి వస్తుందని కాంగ్రెస్ నాయకుల్లో ఆశలు మొదల య్యాయి. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వేముల వాడకు తీసుకవచ్చి రూ 127 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. పనులు మొదలు పెట్టించారు. భక్తులకు వేగంగా దర్శనం కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. బ్రేక్ దర్శనం వంటి వాటికి చర్యలు చేపట్టారు. గోశాలల అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయి.

13 ఏళ్లుగా ట్రస్ట్‌బోర్డు లేకపోవడంతో దేవస్థానంలో అనేక విభాగాల్లో నిర్లక్ష్యం కనిపిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. గత సంవత్సరం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్రంలోని ఆలయాలకు ధర్మకర్తల మండళ్లను నియమిస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు ఆ ప్రకటన కార్యరూపం దాల్చలేదు. మరో వైపు టీటీడీ తరహాలో టస్ట్ బోర్డు ఏర్పాటు కానున్నట్లు ప్రచారం జరుగుతోంది.

13 ఏళ్లుగా ఉత్సవ కమిటీలతోనే...

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి, శ్రీరామనవమి వేడుకలు, శివకళ్యాణోత్సవాలు, ఇలా అనేక వేడుకలు ప్రధానంగా జరుగుతుంటాయి. దేవస్థానానికి తెలంగాణ, ఆంధ్రా, రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. మహా శివరాత్రికి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. మహాశివరాత్రి సమయంలో ఉత్సవ కమిటీలను నియమించి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీలను నియమించినా వారి ప్రమేయం నామామాత్రంగానే ఉంటుంది. అధికార యంత్రాంగం పెత్తనమే కొనసాగు తుంది. భక్తులకు అందించాల్సిన సేవలపై పట్టించు కోవడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి.

వేములవాడ దేవస్థానానికి 1963 నుంచి ట్రస్ట్‌బోర్డు నియామకాలు జరుగుతూ వస్తున్నాయి. 2009 - 2013 వరకు మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న చైర్మన్‌గా కొనసాగిన తరువాత పాలకవర్గాల ఊసే మర్చిపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేములవాడ దేవస్థానం అభివృద్ధి కోసం వీటీడీఏను 2016లో ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి చైర్మన్‌గా, సీనియర్ ఐఏఎస్ అధికారి వైస్ చైర్మన్‌గా నియమించినా హైదరాబాద్ నుంచే కార్యకలా పాలు కొనసాగించారు. గత సంవత్సరం వీటీడీఏను వేములవాడకు తరలించారు. పరిధిని కూడా ఇటీవల జిల్లా వ్యాప్తం చేశారు. వీటీడీఏ కార్యాలయాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు.

జిల్లాలో వేములవాడ దేవస్థానంతో పాటు టెక్స్‌టైల్ కార్పొరేషన్, చిన్న చిన్న దేవాలయాలతో పాటు పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల పదువులు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తూ కాంగ్రెస్ పెద్దల చుట్టూ ఆశావాహులు తిరు గుతున్నారు. ప్రధానంగా వేములవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డు పదవుల పైనే అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

క్రీడల్లో కరీంనగర్‌ను రోల్ మోడల్‌గా నిలపాలి

- స్పోర్ట్స్ స్కూల్‌ను ఇంటర్ వరకు ఉన్నతీకరిస్తాం
- రాష్ట్ర పశుసంవర్థక, క్రీడా, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్



సింథటిక్ ట్రాక్ వద్ద లైటింగ్ ఏర్పాట్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో కరీంనగర్ జిల్లా రోల్ మోడల్‌గా నిలపాలని రాష్ట్ర పశు సంవర్థక, క్రీడా, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి స్పోర్ట్స్ స్కూల్‌లో స్విమ్మింగ్ పూల్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. సింథటిక్ ట్రాక్ చుట్టూ ఏర్పాటు చేయనున్న లైటింగ్ పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇన్నాళ్లు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రతిష్ఠాత్మకంగా భావించామని, అంతకన్నా గొప్పగా కరీంనగర్ క్రీడా పాఠశాలలో వసతులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, సైక్లింగ్ వెలోడ్రం, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు ఏర్పాటు చేస్తామని, పెవిలియన్ భవనానికి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. క్రీడా పాఠశాలను ప్రోత్సహించేందుకు ఇంటర్ వరకు ఉన్నతీకరించడమేగాక పలు సదుపాయాలు కల్పించాలని ఆయన మంత్రి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ క్రీడలు అభివృద్ధికి బడ్జెట్‌లో గత రెండేళ్లలో 860 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 2036లో జరిగే ఒలింపిక్స్‌లో ఈ స్పోర్ట్స్ స్కూల్ క్రీడాకారులు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలన్నారు. అంతకుముందు మంత్రులు అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియాన్ని, స్విమ్మింగ్ పూల్‌ను, అవుట్‌డోర్ స్టేడియాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణారావు, డాక్టర్ సంజయ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథా లయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెప ల్లి మోహన్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వీసీఎండీ సోనీ బాలా దేవీ, కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫు ల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, డీఈవో శ్రీరాం మొండ య్య, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీం దర్, డీవై ఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, క్రీడాపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన జాహ్నవి



జాహ్నవిని సన్మానిస్తున్న సబ్ కోర్ట్ న్యాయమూర్తి, న్యాయవాదులు

వేములవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన వేములవాడ పట్టణానికి చెందిన సంకేపల్లి జాహ్నవిని వేములవాడ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేములవాడ సబ్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ జూనియర్ సివిల్ జడ్జిగా జాహ్నవి ఎంపిక కావడం న్యాయవాదులకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుండ రవి, ఏజీపీ ప్రశాంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ అధికారుల పేరుతో రూ.40వేలు డిమాండ్

ఎల్లారెడ్డిపేట, జూలై7(ఆంధ్రజ్యోతి): మట్టి తరలిస్తున్న తనను తహసీల్ అధికారులకు డబ్బులు ఇవ్వాలని పేర్కొంటూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విలేకరులు శ్రీరామోజు ప్రవీణ్, ఒగ్గు బాలరాజ్ యాదవ్ బెదిరింపులకు దిగారని రాజన్నపేటకు చెందిన ఊడుగుల సురేందర్ సోమవారం తెలిపారు. బెదిరింపులకు సంబంధించిన రికార్డులను బయట పెట్టారు. మట్టి తరలిస్తున్న తన టిప్పర్ ఫొటోలు తీసి రూ.40 వేలు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. విధిలేని పరిస్థితుల్లో రూ.10 వేలు ముట్టజెప్పానని చెప్పారు. మిగతా డబ్బులు ఇవ్వకుంటే వాహనాన్ని తహసీల్ అధికారులు పట్టుకెళతారంటూ బెదిరించారని పేర్కొన్నారు. డబ్బుల కోసం తనను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులు, తహసీల్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.ఈ విషయంపై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా తమ పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే బాధితులు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉపాధి కోల్పోయిన వారికి ఆలయంలో ఉపాధి కల్పించాలి

వేములవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణలో ఉపాధి కోల్పోతున్న గుమస్తాలకు రాజన్న ఆలయంలో ఉపాధి కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏగమంటి ఎల్లారెడ్డి కోరారు. సోమవారం వేములవాడలో విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన రహదారిలో గల కిరాణం, బెల్లం, బట్టల వ్యాపారం లాంటి దుకాణాల్లో పనిచేస్తున్న గుమస్తాలకు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గురిజల శ్రీధర్, మాసం సురేష్, కార్మికులు, గుమస్తాలు సాయి, ప్రకాష్, శివ, ప్రభాకర్, అంకుష్, కనకయ్య, కళ్యాణ్, దేవరాజ్, సాయి, బాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకుంటాం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు గడదాస్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గడదాస్ ప్రసాద్ కుంటుంబ సభ్యులను సోమవారం సిరిసిల్లలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు రూ. 20వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సూచించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాల రాజు, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ నాయకులు ఉన్నారు.

మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు

ఇల్లంతకుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారూమూల గ్రామాలకు రవాణాసౌకర్యాలు మెరుగయ్యాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గాలిపెల్లి నుంచి హైద్రాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సును ప్రజల వినతుల మేరకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి మారుమూల గ్రామాల మీదుగా వెళ్లడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాళ్లపెల్లి, పత్తికుంటపల్లె, ఇటిక్యాలపల్లె, కేసన్నపల్లె, ముస్కానిపేట ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ

సిరిసిల్ల టౌన్ జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం గీతానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా దాతలు నోట్‌బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. దాదాపు రూ. 10వేలు విలువ చేసే నోట్ బుక్కులు పెన్నులను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గుండేటి వేణు, బండారి శివ, గుగ్గిళ్ళ రాజేష్, శ్రీగాధ సిద్దు, కట్ల సత్యనారాయణ, విమల, వెంకటస్వామి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

గంభీరావుపేట, జూలై7(ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ పీరీలను గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

చందుర్తి : మండలం కేంద్రంలో మొహర్రం వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పులి వేషధారణతో యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చిన్న పిల్లలు కేరింతలతో ఉత్సహంగా పాల్గొన్నారు

మొక్కలు నాటిన నాయకులు

వేములవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రామతీర్థపు రాజు, నిమశెట్టి విజయ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు కందుల క్రాంతి కుమార్, సిరిగిరి రామచందర్, వాసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై డబ్బులు అడిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలి

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎవరైనా డబ్బులు అడిగితే లబ్ధిదారులు వెంటనే కలెక్టర్, కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటుంటే కొందరు నాయకులు లబ్ధిదా రులను డబ్బుల డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగల అశోక్, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, కత్తెర దేవదాస్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

కోనరావుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన పస్నం అక్షయ ట్రిబుల్ ఐటీలో సీటు సాధించింది. బాసరలో నిర్వహించే కౌన్సిలింగ్ వెళ్లడానికి డబ్బులు కూడా లేకపోవడంతో దేవత వినయ్ కుమార్ విద్యార్థికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎస్ఎంసి చైర్మన్ ప్రభాకర్, హెచ్ఎం షాబుద్దీన్, అధ్యాపక బృందం వినయ్ కుమార్‌ను అభినందించారు.

ముగిసిన అఖండ భజన

చందుర్తి,జులై 7(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రారంభించిన 24 గంటల పాటు నిర్విరంగా కొనసాగిన అఖండ భజన కార్యక్రమం సోమవారం ఉదయం ముగిసింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

- సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సోమవారం ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి తరలివచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రి పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో 151 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు 48, హౌజింగ్‌శాఖకు 36, డీఆర్‌డీవోకు 23, డీపీవోకు 10, జిల్లా విద్యాధికారికి 8, జిల్లా ఉపాధికల్పన అధికారికి 5, సిరిసిల్ల మున్సిపాల్టీకి 3, జిల్లా సంక్షేమాధికారికి 3, ఎస్‌డీసికి 2, ఎస్పీకి 1, చేనేత జౌళీశాఖకు 1, ఇరిగేషన్‌ఈఈ కి1, సెస్ఎండికి 1, ఎల్‌డీఎంకు 1, పంచాయితీరాజ్ ఈఈకి 1, వేములవాడ దేవస్థానం ఈవోకు1, జిల్లా పౌరసరఫరాల శాఖకు 1, వేములవాడ మున్సిపాల్టీకి1, ఎస్ఎల్అర్ ఏడీకి 1, జిల్లా వైద్యాధికారికి1, ఎస్సీ కార్పోరేషన్ ఈడికి 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపాపడంతో పాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొన్నారు.

- సిరిసిల్లలో సంజీవయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేయాలి

సిరిసిల్ల పట్టణంలో సంజీవనగర్ కామన్ వద్దఉన్న సంజీవయ్య విగ్రహాన్ని తొలగించి డివైడర్ మధ్యలో ఏర్పాటుచేయడం జరుగుతుందని మట్టి విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాట చేయాలంటూ సంజీవయ్యనగర్ యువజన సంఘం సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కూకట్ల కిషన్‌బాబు, ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల ప్రసాద్, రెడ్డిమల్ల అనిల్, బిట్ల శేఖర్, బిట్ల రాములు, కోడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల లేని పాఠశాలలను మూసివేయాలి

సిరిసిల్ల జిల్లాలో అనుమతుల లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలలపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి వాటిని మూసివేయించాలని భీమ్‌ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ , బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింద శ్రీధర్‌లు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోజిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణంతో పాటు ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన శ్రీచైతన్య పాఠశాలలను మూసివేయాలని కోరారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌లతో పాటు యూనిఫాంలను విక్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, నాయకులు సుదీర్, సంతోష్, వినయ్, వెంకటేష్ పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి విద్యుత్ వైర్లు అడ్డుగా ఉన్నాయి

- అరపల్లి దీలిప్, చీకోడు, ముస్తాబాద్



ముస్తాబాద్ మండల చీకోడు గ్రామంలో మా తల్లి అరపల్లి భారతి పేరున ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. అ ఇంటిని నిర్మించుకోవాలంటే ఆ స్థలంపై నుంచి విద్యుత్ వైర్లు ఉండడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టడం ఇబ్బందిగా మారింది. విద్యుత్ వైర్లను తొలగించాలని సెస్ అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలి

బ్యాటరీ సైకిల్‌ను ఇప్పించండి



- సంద్రగిరి సంజీవ్, శాభాష్‌పల్లి

శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన నాకు కాళ్లు పనిచేయక పోవడంతో నడువ లేనిస్థితిలో ఉన్నాను. నాకు జిల్లా కలెక్టర్ స్పందించి బ్యాటరీ సైకిల్‌ను ఇప్పించి ఆదుకోవాలి.

దివ్యాంగుల పింఛన్ ఇప్పించండి

- మంద మహేష్, మండెపల్లి, తంగళ్లపల్లి



తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన నేను గత సంవత్సరం ఏప్రిల్ 22న సౌదీలో జరిగిన రోడ్డుప్రమాదంలో నా కాలును పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాను. కలెక్టర్ స్పందించి దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలి.

డ్రాప్ అవుట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

ఉమ్మడి జిల్లా పరిశీలకుడు రమణారావు

వేములవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కళాశాలలో అడ్మిషన్ పొందిన తర్వాత కళాశాల మానేసిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిశీలకుడు వి. రమణారావు అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ప్రథమ సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు కాలేజీ మానేస్తున్న విద్యార్థుల సంఖ్యను తగ్గించడానికి రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఉమ్మడి జిల్లాల వారీగా అబ్జర్వర్లను నియమించగా సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లతో వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం అయ్యారు. గ్రామీణ ప్రాంతంతో పాటు చిన్న పట్టణాలలో అడ్మిషన్ పొందిన తర్వాత కళాశాల మానివేసిన విద్యార్థులపై తప్పనిసరిగా దృష్టి సారించి కళాశాలకు వచ్చే విధంగా చొరవ చూపాలని నిర్దేశించారు. కళాశాల మానేసిన తర్వాత విద్యార్థులు ఇతర వ్యాపకాలకు అలవాటయ్యే అవకాశం ఉన్నందున వీటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రథమ సంవత్సరంలోనూ అడ్మిషన్ల సంఖ్యను కూడా పెంచడానికి క్షేత్రస్థాయిలో తిరిగి తప్పనిసరిగా కళాశాలలో సంఖ్యను పెంచాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీనివాస్, వేములవాడ కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు ఉన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- మున్సిపల్ ఎదుట కార్మికుల ధర్నా

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చూస్తుందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేసి కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని కార్మికుల కనీస వేతనం రూ. 26వేలు అందించాలని డిమాండ్ చేశారు. జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమ్మెలో భాగంగా జూలై 9న స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్మికులతో భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ చంద్రయ్య, కార్యదర్శి కాసారపు శంకర్, నాయకులు రెడ్డిమల్ల రాజయ్య, విజయ, భారతి, లక్ష్మి, నరేష్, శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

డాక్టర్ వంశీధర్‌గౌడ్‌కు ఎక్సలెన్స్ అవార్డు



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న వంశీధర్‌గౌడ్

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ నేరెళ్ల వంశీధర్‌గౌడ్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా మెడికల్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం సిరిసిల్లలో ఐఎంఏతో పాటు, వైద్యులు డాక్టర్ వంశీధర్‌గౌడ్‌ను అభినందించారు. శనివారం రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో అవార్డును గవర్నర్ అందించారు.

సమ్మెను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సోమవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సీఐటీయూ, ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేఖ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు.

ఇల్లంతకుంట : సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం సార్వత్రిక సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు వరుకోలు మల్లయ్య, హమాలి సంఘ జిల్లా అధ్యక్షుడు సావనపెల్లి రాములు పాల్గొన్నారు.

48 కేసుల్లో నిందితులకు జైలు శిక్ష : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఆరు నెలల్లో 48కేసుల్లో నిందితులకు జైలు శిక్ష పడిందని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పలు కేసులలో నిందితులకు శిక్షలు పడేలా కృషిచేసిన పీపీలు వేముల లక్ష్మిప్రసాద్, పెంట శ్రీనివాస్, లక్ష్మన్, సందీప్, సతీష్, విక్రాంత్, సిఎంఎస్ ఎస్ఐలు శ్రావణ్‌యాదవ్, రవీంద్ర నాయుడు, సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షల శాతం పెంచితే సమాజంలో మంచిమార్పు తీసుకురావచ్చన్నారు. నిందితులకు శిక్షలు పడటంలో పోలీసులు, పీపీలది కీలకపాత్ర అన్నారు. పోలీసులు, పీపీలు సమన్వయంతో నేరస్థులకు తప్పకుండా శిక్ష పడే విధంగా కృషిచేయాలన్నారు. ప్రదాన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషిచేసి శిక్షల శాతం పెరిగేలా పనిచేయడం అభినందనీయమన్నారు. పోలీసు అధికారులు, న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్థులకు శిక్ష పడే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోక్సో, హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతికత కీలకంగా మారిందన్నారు. అన్ని కేసుల్లో సైంటిఫిక్ ఆధారాలు తప్పకుండా జమచేయాలన్నారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన ఓ హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు పడటంలో కృషిచేసిన కోర్టు కానిస్టేబుళ్లు దేవేందర్, రాజేందర్, నవీన్‌లను ఎస్పీ అభినందించారు.



పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్ల టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ రిజర్వేషన్లు సమాజాన్ని ఒప్పించి మెప్పించిన నాయకుడిగా మందకృష్ణ మాదిగ ప్రజల మనస్సులను దోచుకున్నాడని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎంఆర్పీఎస్ 31వ ఆవిర్భవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా ఇంచార్జి పుట్ట రవి ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 60వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయ కులు స్వీట్లను పంపిణీ చేశారు. మంద కృష్ణ మాదిగ పోరాటాలతోనే ఎస్సీ కులంలోని 58 ఉపకులాలకు 9 శాతం రిజర్వేషన్ లభించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాల రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు బడుగు లింగం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. మండలశాఖ అధ్యక్షుడు మంద రాజుమాదిగ ఎమ్మార్పీఎస్ పతాకాన్ని సోమవారం మండలకేంద్రంలో ఎగురవేశారు. బస్టాండ్ ప్రాంతంలో మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఎస్సీవర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ చిరస్థాయిలో నిలిచిపోతాడన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే అణగారినవర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పట్నం మహేందర్, సావనపెల్లి నాంపలి, కానుపాక సురేష్, బొడ్డు వెంకటేశం, నర్సింహులు, నాయకులు గన్నేరం మల్లయ్య, గుంద్రెడ్డి రాజు, సావనపెల్లి రాకేష్, మంద రాములు, తడకపెల్లి భూమయ్య, వినోద్, పసుల వెంకన్న, దేవదాస్, శంకర్, రాగటి రమేష్, హన్మంతు, విజయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో కేకే కట్ చేస్తున్న నాయకులు



ముస్తాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, దుమాల, అల్మాస్‌పూర్, కోరుట్లపేట, వెంకటాపూర్, నారాయణపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఆ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పలువురు నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, శంకర్, శ్రీనివాస్, చంద్రయ్య, నర్సయ్య, రాజయ్య, ఎల్లయ్య, బాలయ్య, నారాయణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను మండల అధ్యక్షులు గద్దెరాశి భగవంతం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. వివిధ పార్టీల మండల నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాలులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. 30 ఏళ్ల పోరాటాలతో ఎస్సీ వర్గీకరణ అమలుకు నోచుకుందని అన్నారు. అనంతరం మాదిగ దండోర నాయకులకు మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం తన స్వంత డబ్బులతో 50 డప్పులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు చంద్రమౌళి, భాను, శంకర్, హమీద్, వెంకటస్వామిగౌడ్, లింగంయాదవ్, వెంకటి, నరేశ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షులు సుంచు మల్లయ్య, మాజీ సర్పంచ్ ఎల్లం, గ్రామశాఖ అధ్యక్షులు బుచ్చయ్య ఉపాధ్యక్షులు నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దయ్యాల నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దయ్యాల కమలాకర్, అక్కనపల్లి శ్రీనివాస్, గంగాధర్, గంగారెడ్డి, ఓద్యరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడకలను మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ డివిజన్ అంబేద్కర్ సంఘం, అధ్యక్షులు ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఉపాధ్యక్షులు అర్జున్, నాయకులు అంజయ్య, పెంటయ్య. రవి, శంకర్, బాబు, దేవయ్య, అజయ్, రాజు, శ్రీనివాస్, ఆనంద్, రాములు, రమేష్ పాల్గొన్నారు.

ఏపీవో శ్రీనివాస్‌కు నివాళి

కోనరావుపేట, జులై 7 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో శ్రీనివాస్‌కు మండల పరిషత్ అధికారులు సోమవారం నివాళులర్పించారు. పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కమ్మగాని శ్రీనివాస్ ఏపీవో గుండెపోటుతో మృతి చెందగా తన ఆత్మకు శాంతి చేకూరాలని కోనరావుపేట ఎంపీడీవో శంకర్ రెడ్డితో పాటు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాస్ రాజు, తిరుపతి, గణేష్, మహమ్మద్, ఉమారాణి నివాళులర్పించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోనరావుపేట వైద్యాధికారి వేణుమాదవ్ అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలిసా టెస్ట్ ద్వారా డెంగ్యూ పాజిటివ్ అని నిర్థారణ అయితేనే నమ్మాలని అన్నారు. ఎవరు కూడా డెంగ్యూ పాజిటివ్ అని చెప్పరాదని అన్నారు. ఈ సందర్భంగా రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం మోహన్, రషీద్, అరుణ్, చందు, సాయిలాల్, సంపూర్ణ, శ్రీలత, నాగరాణి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

చందుర్తి జూలై 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కనీస వేతనం అమలు చేయాలని మిడ్ డే మీల్స్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 9న సమ్మె చేపడుతున్నట్లు చందుర్తి ఎంఈఓకు ఆల్ ఇండియా మధ్యాహ్న భోజన నిర్వాకులు సమ్మె నోటీసు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు విజయ ఉపాధ్యక్షురాలు లింగంపల్లి లక్ష్మి, రేణుక, కొమురవ్వ, గడ్డం మల్లవ్వ, నర్సవ్వ, రాజవ్వ, లావణ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.